క్లుప్తంగా

వైభవంగా శ్రీరామ కల్యాణ మహోత్సవం



నగరంపాలెం: స్థానిక మారుతీనగర్ శ్రీకంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తోన్న మహాసామ్రాజ్య పట్టాభిషేకంలో భాగంగా శనివారం పారాయణలకు మహా హోమ పూర్ణాహుతి నిర్వహించారు. శ్రీరామసేవా సమితి (వారణాసి), శ్రీమారుతీ దేవాలయ సంఘం ఆధ్వర్యంలో జరగ్గా, సాయంత్రం శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. శ్రీరామసేవా సమితి నిర్వాహకులు డాక్టర్ యూవీ సోమయాజులు ఆధ్వర్యంలో పూర్ణాహుతి జరగ్గా, కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఘనంగా జేసుదాస్ జన్మదిన వేడుకలు



లక్ష్మీపురం: గాన గంధర్వుడు భారతీయ సంగీత ప్రపంచంలో జేసుదాసు పేరు తెలియని వారంటే అతిశయోక్తి లేదని ఇంత వరకు 40 వేల పాటలు పాడి అన్ని భాషల అన్ని ప్రాంతాల ప్రజల అభిమానం పొందారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంగీత విద్వాంసుడు వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గాన గంధర్వుడు జేసుదాస్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1961 నవంబర్ 14 ఒక మళయాళ చిత్రంకు పాట పాడటం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన జేసుదాసు వెనుదిరిగి చూడలేదన్నారు. సీనియర్ గాయకుడు పోతురాజు పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

లక్ష్మీపురం: సంక్రాంతి అంటేనే సంతోషాల, వినోదాల పండుగని తెలుగు రాష్ట్రాల్లో అంత్యంత వేడుకగా జరుపుకునే వివిధ సంప్రదాయ వేడుకలతో కూడిన సంక్రాంతి పండుగ అని రంగస్థల నటుడు పల్నాటి సుబ్బారావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం సంస్థ కార్యదర్శి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ప్రారంభించారు.

రాష్ట్రపతి పాలన తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదు

లక్ష్మీపురం: రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు (సంగమ్) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

లక్ష్మీపురం: డాక్టర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలిగించాలని ఏపీసీసీ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి గణేష్ యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక లాడ్జి సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్‌కుమార్ నేతృత్వంలో మౌన దీక్ష నిర్వహించారు. మాజీ శాసన సభ్యులు మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వర రావు, పార్టీ నాయకులు గడ్డం పాల్‌విజయ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోడేటి సందీప్ పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు రూ.15 వేలు సాయం చేయాలి



లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం ప్రతి ఆటో కార్మికునికి సంవత్సరానికి రూ.15000 ఆర్థిక సాయం ఇవ్వాలని ఆటో డ్రైవర్స్–వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామన మూర్తి డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగంభవన్‌లో యూనియన్ నగర అధ్యక్షులు కూరాకుల రాంప్రసాద్ అధ్యక్షతన గుంటూరు నగర ఆటో డ్రైవర్స్–వర్కర్స్ యూనియన్ 8వ మహాసభ శనివారం నిర్వహించారు. తొలుతగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు జంగాల అజయ్‌కుమార్ సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి మంగా శ్రీనివాసరావు, నగర గౌరవాధ్యక్షులు కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, గని, ఏఐవైయఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య పాల్గొన్నారు.

ఇంట్లోనే వైద్యపరీక్షలు

- అందుబాటులో ఆధునిక వైద్య పరికరాలు
- టెక్నాలజీ రాకతో తగ్గుతున్న వైద్య ఖర్చులు
- త్వరితగతిన వ్యాధి నిర్ధారణ
- సమయం, డబ్బు ఆదా

గుంటూరు మెడికల్: ఆధునిక వైద్య విజ్ఞానం అందుబాటులోకి రావడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు చేరువయ్యాయి. బీపీ, షుగర్, లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు ప్రతి రోజు పరీక్షలు అవసరం అవుతాయి. వాటి నిర్ధారణ కోసం క్లినిక్‌లకు పరుగుల తీసే పని లేకుండా ఇంట్లోనే వ్యాధి నిర్ధారణ చేసుకునే ఆధునిక వైద్య పరికరాలు నేడు గుంటూరులో లభ్యం అవుతున్నాయి. కచ్చితమైన వ్యాధి నిర్ధారణతో పాటు కొన్ని నిమిషాల వ్యవధిలోనే వ్యాధి నిర్ధారణ జరుగుతుంది. ఫలితంగా రోగులు ఆగమేఘాల మీద ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన అవసరం ఉండదు. అక్కడకు వెళ్లి వేచి చూడాల్సిన పని ఉండదు. సమయం, డబ్బు ఆదా అవుతాయి. ప్రజల్లో ఆరోగ్యంపై బాగా అవగాహన పెరిగి ప్రతి చిన్నదానికి ఆస్పత్రులకు పరుగులు తీయకుండా ఇంట్లో వైద్య పరీక్షలు చేసుకుంటున్నారు.

ఎలక్ట్రానిక్ బీపీ మీటర్లు...



రోజు రోజుకు బీపీ బాధితుల సంఖ్య అధికమవుతోంది. ప్రతి రోజు బీపీ ఎంతుందో తెలుసుకుని బీపీ నియంత్రణ కోసం మందులు వాడాల్సి ఉంది. బీపీ నిర్ధారణ కోసం ఆస్పత్రి వెళ్లే పని లేకుండా ఇంట్లోనే పరీక్ష చేసుకునేందుకు ఎలక్ట్రానిక్ బీపీ ఆపరేటర్లు మార్కెట్‌లో లభిస్తున్నాయి. ఆపరేటర్ స్విచ్ ఆన్ చేయగానే ఒక్కనిమిషంలోనే రక్తపోటు, గుండె కొట్టుకునే వేగం కూడా తెలిసి పోతుంది.

షుగర్ బాధితుల కోసం.....

దీర్ఘకాలిక వ్యాధి మధుమేహం. ప్రతి రోజు రక్తంలో షుగర్ శాతం తెలుసుకుని దానిని అదుపులో పెట్టుకోవాలి. లేని పక్షంలో లెవల్స్ పెరిగిపోయి గుండె, కిడ్నీ, కళ్లు తదితర శరీర అవయవాలు పాడయ్యే ప్రమాదం ఉంది. ఆధునిక గ్లూకోమీటర్స్ మార్కెట్‌లో లభిస్తున్నాయి. వీటి సహాయంతో కేవలం సెకన్ల వ్యవధిలోనే రక్తంలో షుగర్ లెవల్స్ తెలుసుకోవచ్చు. సూది గుచ్చుకున్నంత నొప్పి మాత్రమే రోగికి ఉంటుంది. ఎక్కువ రక్తం తీయకుండానే కేవలం ఒక్క చుక్క రక్తంతోనే షుగర్ తెలుసుకోవచ్చు.



ఆస్తమా రోగుల కోసం...



చలికాలంలో రోగులను బాగా వేధించే సమస్య ఆస్తమా. పిల్లలు, వృద్ధులు ఎంతో ఇబ్బంది పడిపోతారు. రాత్రి వేళల్లో నిద్రపోయేందుకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. అలాంటి సమయంలో ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి వస్తుంది. ఆస్పత్రులకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండి ఊపిరితిత్తుల్లో ఉన్న ఇన్‌ఫెక్షన్‌ను తగ్గించేందుకు నెబిలేజర్ వైద్య పరికరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

గర్భనిర్ధారణ పరీక్ష...



గర్భం వచ్చిందా లేదా అని నిర్ధారణ చేసే పరీక్షను ఇళ్ల వద్దే చేసుకోవచ్చు. వన్‌స్టెప్ ప్రెగ్నెన్సీ టెస్ట్ డివైస్ ద్వారా ఈ పరీక్ష చాలా సులువుగా చేయవచ్చు. యూరిన్‌ను ఒక చుక్క స్ట్రిప్‌పై వేస్తే దానిపై ఎర్రగీత ఒక్కటి కనిపిస్తే గర్భం రానట్టు లెక్క. రెండు ఎర్రటి గీతలు కనిపిస్తే గర్భం వచ్చినట్లు.

పడకపై ఉండే బాధితుల కోసం..

పక్షవాతం వచ్చి నడవలేకుండా మంచానికే పరిమిత మయ్యే వారికి, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి వెన్నుపూస దెబ్బతిని మంచం దిగలేని వారికి మల, మూత్ర విసర్జనకు తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు ఎంతో కష్టపడాల్సి వస్తుంది. వారి సమస్యలకు చెక్ పెట్టేందుకు నేడు ఆధునిక వీల్‌ఛైర్స్ అందుబాటులోకి వచ్చాయి. వీటిల్లో మల, మూత్రాలను పట్టేందుకు కింద భాగంలో చిన్న బకెట్‌లు అమర్చుతారు. వాటిని వినియోగించిన పిదప శుభ్రం చేసి పెట్టవచ్చు. మడత కుర్చీలపై పండుకున్న మాదిరిగా నడుంవాల్చుకుని పడుకునే సౌకర్యం కూడా ఉన్న వీల్‌ఛైర్స్ ఉన్నాయి. అధిక బరువుఉన్న వారు సుమారు 150 కిలోల వారు వీటిపై కూర్చునే విధంగా ధృఢంగా, సౌకర్యం వంతంగా వీటిని తయారు చేశారు.



వైద్యంపై అవగాహన పెరిగింది....



డిజిటల్ బీపీ ఆపరేటర్లు, షుగర్ పరీక్షలు చేసుకునే గ్లూకో మీటర్లు మార్కెట్‌లోకి అందుబాటులోకి రావటంతో ప్రజల్లో వ్యాధిపై అవగాహన పెరిగింది. బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధి బాధితులకు తరచుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాల్సి ఉంది. ఆధునిక వైద్య పరికరాలు గతంలో లేకపోవటం, వీటిపై ప్రజలకు అవగాహన అంతగా లేకపోవటంతో ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపిస్తు డిజిటల్ వైద్య పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరు తమకు బీపీ, షుగర్ ఎంత ఉందో తెలుసుకుని వాటిని అదుపులో పెట్టుకుని ఆరోగ్యంగా ఉండాలని అవగాహన పెంచుకున్నారు.

–డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, గుంటూరు

వైద్యుల పర్యవేక్షణ ఉండాలి



బీపీ, షుగర్‌లాంటి జబ్బులకు ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి రావటం చాలా శుభపరిణామం. రోగులు ప్రతి రోజూ ఈ పరీక్షలు చేయించుకోవాలి కాబట్టి ఇంటి వద్దే కొన్ని నిమిషాల వ్యవధిలో రిపోర్టు తెలుసుకునేలా అవకాశం ఉంది. ఆధునిక వైద్య పరికరాలతో ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఇళ్లవద్దే కొన్ని రకాల వైద్యపరీక్షలు స్వయంగా క్షణాల్లో తెలుసుకుని మందులు తీసుకోవటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. అయితే అప్పుడప్పుడు దీర్ఘకాలిక రోగులు వైద్యులను సంప్రదించి వారి పర్యవేక్షణలో మందులు వాడుతూ ఉంటే వారి ఆరోగ్యానికి ఎలాంటి ఢోకా ఉండదు.

– డాక్టర్ ఉప్పుటూరి అంజిత్, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్టు, గుంటూరు

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మునిసిపల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో సంక్రాంతి సంబరాల ఏర్పాట్లపై అధికారులు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 4 రోజుల పాటు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సంబరాల్లో భాగంగా ఆదివారం 9 గంటల నుంచి 11 గంటల వరకు ముగ్గుల పోటీలు (రంగోలి), మెహంది (మహిళలు, పిల్లలకు) జరుగుతాయని తెలిపారు. ఇప్పటికే సంబరాల్లో నిర్వహించే వివిధ పోటీలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తమ పేర్లు నమోదు చేసుకున్నారని వివరించారు. సంబరాలు జరిగే స్టేడియంలో మౌలిక వసతుల ఏర్పాటుకు అధికారులు, నిర్వహణ కమిటీ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు.

ఐలాండ్స్ సుందరీకరణపై దృష్టి సారించాలి

గుంటూరు నగరంలోని ఐలాండ్స్, డివైడర్ల నిర్వహణపై ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ గాంధీ పార్క్ ఎదుట ఐలాండ్, డివైడర్లు, వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఎదుట పింక్ టాయ్ లెట్స్, పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యాన్ని పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఐలాండ్స్‌లో పచ్చదనం పెంపు, నీటి స్ప్రింకర్ల మరమ్మతులుంటే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డివైడర్లపై పచ్చదనం కోసం నాటిన మొక్కలు కొన్ని ప్రాంతాల్లో లేవని, ఆయా ప్రాంతాల్లో నూతన మొక్కలు నాటాలని, ఉన్న మొక్కలను ఎప్పటికప్పుడు ట్రిమ్మింగ్ చేయాలని పార్క్ విభాగ ఏడీహెచ్‌ని ఆదేశించారు. విజ్ఞాన మందిరం ఎదుట పింక్ టాయ్ లెట్స్‌ని పరిశీలించి, వాటి నిర్వహణ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఓల్డ్ క్లబ్ రోడ్, కుగ్లర్ హాస్పిటల్ రోడ్‌లో పర్యటించి పారిశుద్ధ పనులపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



జీకేఆర్ హైస్కూల్లో విద్యార్థులతో జనార్ధన్‌రెడ్డి, సుశీల

గుంటూరు ఎడ్యుకేషన్: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని హిందూ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలతో పాటు స్వామి వివేకానంద జయంతిని జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడారు. కళాశాల ప్రాంగణంలో అందమైన రంగ వల్లులను తీర్చిదిద్ది, భోగి మంట వేసి, పొంగలి వండారు. అధ్యాపకులతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వైష్ణవి, వేదవతి, ఎ.బాజీబాబు, ఎన్.మణికంఠ, బి.అనిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

జీకేఆర్ హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

గుంటూరు ఎడ్యుకేషన్: జీకేఆర్ హైస్కూల్ పట్టాభిపురం, ఏటీ అగ్రహారం క్యాంపస్‌లలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో అందమైన ముగ్గులు, భోగి మంట వేశారు. విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్లు జి.కొండారెడ్డి, జి.జనార్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ శైలజ, సుశీల చిన్నారులకు భోగి పళ్లు ఆశీర్వదించారు.



జేకేసీ కళాశాలలో భోగిమంట వద్ద మురళీమోహన్, ఎస్సార్కే ప్రసాద్, గోపీచంద్

జేకేసీ కళాశాలలో..

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ పాల్గొని భోగిమంట వేసి, సంబరాలను ప్రారంభించారు కార్యక్రమంలో కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో కూటమి విఫలం

సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్



లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం ప్రజలు చేసిన హామీలు నెరవేర్చడంలో పూర్తి విఫలం అయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. కొత్తపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ఎంత దుర్మార్గంగా రాక్షసంగా ఉన్నారంటే పత్రికల్లో టీవీల్లో చిలక పలుకులు పలుకుతున్నారని విమర్శించారు. రైతుకి గిట్టుబాటు ధర ఇవ్వాలని, రైతుకి కనీస మద్దతు ధర ఇవ్వాలని వ్యవసాయ రంగాన్ని కాపాడాలని పంజాబ్‌లో 46 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకులు దళయవాల్‌కు పరామర్శించే దిశగా కూడా ఆలోచన చేయకపోవడం మోదీ రాక్షసత్వానికి నిదర్శనం అన్నారు. మన రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లు మోదీ జపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నాయకులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ కోర్సు ప్రాక్టికల్ పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో శనివారం ఎన్‌సీసీ 25 ఆంధ్ర బెటాలియన్ గుంటూరు గ్రూప్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్లకు ఏ సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ కుమార్ శర్మ మాట్లాడుతూ ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ కోర్సు ప్రాక్టికల్ పరీక్షకు గుంటూరు గ్రూప్ పరిధిలోని 30 పాఠశాలలకు చెందిన 800 మంది క్యాడెట్లు హాజరైనట్లు చెప్పారు. రాత పరీక్ష అనంతరం డ్రిల్‌కు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించారు. ఆర్మీలో సిబ్బంది కొరతను తీర్చేందుకు 1948లో ఎన్‌సీసీని ఏర్పాటు చేశారని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచి కళాశాలల్లో చదివే వివిధ రకాల విద్యార్థినీ, విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ అందిస్తున్నామని, ఒక వ్యక్తిని క్రమశిక్షణలో నడిపేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో విజయ్ మోహితి పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన కళాపరిషత్ నాటకోత్సవాలు

నగరంపాలెం: వారం వారం, నాటక వారం, శనివారం చంద్రన్న వరం కార్యక్రమం నిర్వహించేందుకు సీఎం చంద్ర బాబు నిర్ణయించడం కళా సంస్థలు, కళాకారులకు గొప్ప అవకాశమని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం రాత్రి గుంటూరు కళాపరిషత్ 27వ వార్షిక నాటకోత్సవాలు రెండో రోజుకి చేరాయి. గోపాలకృష్ణ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నాటక ప్రదర్శనలకు టీటీడీ వారితో పారితోషికాలు ఇప్పించేందుకు సీఎం చంద్రబాబు సహకారంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ రంగస్థల నటుడు, కళాపరిషత్ ఉపాధ్యక్షుడు నాయుడు గోపీ మాట్లాడుతూ పరిషత్ నిర్వహణకు దాతల సహకారం మరువలేనిదని అన్నారు. ప్రముఖ ఆడిటర్ బొల్లేపల్లి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పోపూరి శివరామకృష్ణ, ఆవుల సుబ్బారావు ప్రసంగించారు. కార్యదర్శి గుమ్మడి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పీవీ మల్లికార్జునరావు, బి.పూర్ణ, గౌరవ సలహాదారులు ఆవోకం పెద్దబ్బయ్య, కార్యవర్గ సభ్యులు షేక్ సైదా, రావుల అంజిబాబు పాల్గొన్నారు. అనంతరం గంగోత్రి (పెదకాకాని) వారి అష్టమ వస్తువు సాంఘిక పద్య నాటకం ప్రదర్శించారు. ప్రేక్షకులను అలరించింది. గుమ్మడి గోపాలకృష్ణను సత్కరించారు.



అష్టమ వసువు సాంఘిక పద్య నాటికలో సన్నివేశం

ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు నవీన విద్యాసంస్థల చైర్మన్ వై.చిన్నపరెడ్డి పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని నవీన హైస్కూల్ 45వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నపరెడ్డి మాట్లాడుతూ 45 ఏళ్లుగా పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు మంచి బోధన అందించి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే అవకాశం కలిగిందని తెలిపారు. ఈసందర్భంగా గత ఏడాది టెన్త్ ఫలితాల్లో 500 పైగా మార్కులు తెచ్చుకున్న 102 మంది విద్యార్థులకు సిల్వర్ మెడల్స్ బహూకరించారు. 596 మార్కులతో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని ఎం.శ్రీనిధిని ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వై.చిన్నమ్మ, డైరెక్టర్లు నవీన్‌రెడ్డి, మాధవి, ఆనంద రెడ్డి, సునీత పాల్గొన్నారు.



రజత పతకాలు అందుకున్న టెన్త్ విద్యార్థులతో చిన్నపరెడ్డి, చిన్నప్ప, పాఠశాల డైరెక్టర్లు

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడంలో విద్యాసంస్థల యాజమాన్యాలు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం జరిగిన వార్షిక క్రీడోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీఈఓ రేణుక మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, ఆటలు విద్యార్థులను శారీరకంగా, మానసికంగా ధృడంగా చేస్తాయని అన్నారు. పాఠశాల డైరెక్టర్ కె.శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ క్రీడలు, ఆటలు వంటి పాఠ్యాంశేతర కార్యక్రమాలు విద్యార్థు అభ్యున్నతిపై ప్రభావాన్ని చూపుతాయని, ప్రతి విద్యార్థిలో నాయకత్వ నైపుణ్యాలను వెలికితీయడంలో దోహదం చేస్తాయని అన్నారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సైక్లిస్ట్ బి.సుబ్బయ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీవిద్య, ప్రిన్సిపాల్ సుధీర్ కృష్ణన్ పాల్గొన్నారు.



క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో వాసిరెడ్డి విద్యాసాగర్, శ్రీకాంత్‌బాబు, శ్రీవిద్య

వైభవంగా కూడార్రై వేడుకలు



శ్రీరామనామాక్షేత్రంలో..



లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో..

నగరంపాలెం: స్థానిక వైష్ణవాలయాల్లో కూడార్రై పండుగ వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామి వారు అమ్మవార్లకు విశేష అభిషేకార్చనలు, ప్రత్యేకాలంకారణాలు చేశారు. పాలు, నెయ్యితో తయారు చేసిన కూడార్రై పాయసం 108 పాత్రల్లో నింపి స్వామి వారికి నైవేద్యం చేసి భక్తులకు అందించారు. కృష్ణనగర్ ఒకటో వీధిలోని శ్రీగోదా పద్మావతిదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనకుదరం శ్రీనివాసాచార్యులు అర్చక బృందం, శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ధనకుదరం సీతారామానుజాచార్యుల అర్చక బృందం ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఆర్.అగ్రహారం శ్రీరామ నామక్షేత్రంలో ట్రస్టీలు రాగం వెంకటలీలాసుందరి, బెల్లంకొండ మస్తాన్‌రావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కూడార్రై పండుగను వైభవంగా చేపట్టారు.

అన్నమయ్య కళావేదికపై కూడార్రై ఉత్సవం

స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం రాత్రి కూడార్రై ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తితిదే ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు సౌజన్యంతో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ కోగంటి వెంకటశ్రీరంగనాయకి ఆధ్వర్యంలో జరిగాయి.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గుంటూరు మెడికల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జమాయమ్మ(54) శనివారం మృతి చెందింది. బంధువుల అందించిన వివరాలు.. నిడుముక్కల గ్రామానికి చెందిన జమాయమ్మ డిసెంబరు 15న బాపట్ల సమీపంలోని అల్లూరు సెమీక్రిస్మస్ వేడుకలకు వెళ్లింది. 16న స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా తాడికొండ అడ్డరోడ్డు దాటిన తరువాత ద్విచక్ర వాహనం అదుపు తప్పి కాలువలో పడి పోయింది. తలకు తీవ్ర గాయాలు అవడంతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం అడ్మిట్ చేశారు. డిసెంబరు 16 నుంచి ఐసీయూ చికిత్స పొదుతున్న జమాయమ్మ శనివారం మృతి చెందింది.

చోరీలకు పాల్పడుతున్న నిందితుల అరెస్టు

పట్నంబజారు: ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీలకు పాల్పడుతున్న నిందితులను ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన చిర్రా ఆదిలక్ష్మి, చిర్రా వీరమ్మ బస్టాండ్‌లోని 15 నంబరు ప్లాట్‌ఫాం వద్ద బస్సు ఎక్కుతున్న సమయంలో వారి పర్సును పలువురు మహిళలు అపహరించారు. దీన్ని గమనించిన ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది ఆ మహిళలను పట్టుకున్నారు. మరో మహిళ పరారైంది. నిందితుల నుంచి 14 సవర్ల, రెండు బంగారపు గొలుసులు, రూ.340 స్వాధీనం చేసుకున్నారు. చోరీలకు పాల్పడుతున్న మహిళలు గుంటూరు నల్లచెరుకు చెందిన వల్లపు కుమారి, పసుపులేటి కనకం, మరో మహిళ ఉన్నారు. వీరిలో కుమారి, కనకంలను పట్టుకోగా, మరో మహిళ పరారైంది. ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది మునిరెడ్డి, ఆర్టీసీ డ్యూటీ కంట్రోలర్స్ సహాయంతో నిందితులను పట్టుకుని పాతగుంటూరు పోలీసులకు అప్పజెప్పారు. ఈమేరకు పోలీసులు మహిళలను విచారిస్తున్నట్లు తెలిపారు.